PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 20 ॥శుక్రవారం ॥ 19-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్




తెలంగాణలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. వానాకాలం పంటలకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడుదల చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన సుదీర్ఘంగా జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

భేటీ అనంతరం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క సంయుక్తంగా విలేకరుల సమావేశంలో కేబినెట్ తీర్మానాలను వెల్లడించారు. ఈ నెల 30వ తేదీన ఖమ్మం జిల్లా మధిరలో పెద్దఎత్తున నిర్వహించబోయే రైతు సమ్మేళనం బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రైతు భరోసా నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

# 30న రైతు భరోసా!

**సీఎం రేవంత్ అధ్యక్షతన మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు.. ఏడు రకాల సన్న వడ్లకు బోనస్ చెల్లింపు**

- రికార్డు స్థాయిలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- ఎరువుల కోటా, మెట్రో ఫేజ్-2 కోసం ఢిల్లీకి మంత్రుల బృందం
- రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ ఎంపీలు కలిసి రావాలని సూచన
- ఉపాధి హామీ చట్టం మార్పులపై మంత్రివర్గ ఉపసంఘం
- నీట్ రాసే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- మీడియాకు వివరించిన మంత్రులు ఉత్తమ్, తుమ్మల, సీతక్క



హైదరాబాద్, జూన్ 18: మార్కెట్ డిమాండ్, ప్రజల వినియోగం మరియు అధిక దిగుబడిని పరిగణనలోకి తీసుకుని ఏడు రకాల సన్న ధాన్యానికి బోనస్ చెల్లించాలని కేబినెట్ నిర్ణయించింది. దీని ప్రకారం బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-7715 రకాల సన్న వడ్లకు ఈ బోనస్ వర్తిస్తుంది. తరువాయి 3 వ పేజీలో...



## హరిత తెలంగాణ లక్ష్యం

**సబర్మతి, గంగా, యమునా నదుల కంటే అద్భుతంగా మూసీ ప్రక్షాళన**

- గండిపేట- గౌరెల్లి వరకు 55కి.మీ మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి
- హైడ్రాను బూచిగా చూపిస్తున్నారు.. పేదల జోలికి వెళ్లదు
- ఫ్యూచర్ లేనివాళ్లే.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్నరు
- 11 జిల్లాల్లో 17.66 కోట్లతో అర్బన్, ఎకో పార్కుల ప్రారంభం
- గుర్రంగూడ వనమహోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

పర్యావరణ పరిరక్షణ, హరిత తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కబ్జాదారుల తోలు తీస్తామని హెచ్చరించారు.

హైదరాబాద్, జూన్ 18: గురువారం ఎల్బీనగర్ నియోజకవర్గం గుర్రంగూడ ఎకో పార్క్‌లో జరిగిన వనమహోత్సవం-2026 కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై తీవ్ర తరువాయి 2 వ పేజీలో...



## విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ

- పీవీ నరసింహారావును ఆదర్శంగా తీసుకోవాలని కేటీఆర్ పిలుపు
- మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభం
- పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం హామీ

**హైదరాబాద్, జూన్ 18**

మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులకు నోట్‌బుక్స్, (మిగతా 2వ పేజీలో)



## కార్యకర్తలకే పెద్దపీట

- ప్రతి సంక్షేమ కార్యక్రమం వారి చేతుల మీదుగానే
- కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి
- పోలవరం నిర్వాసితులకు న్యాయం కోసం పోరాటం
- రంపచోడవరం కార్యకర్తలతో భేటీలో వైయస్ జగన్ వెల్లడి

తాడేపల్లి, జూన్ 18: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా "జగన్ 2.0"లో పార్టీ కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తామని, భవిష్యత్తులో ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని కార్యకర్తల ఆధ్వర్యంలోనే తరువాయి 3వ పేజీలో...



## చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ వినతిపత్రం
- చేనేత కార్మికుల ఉపాధి పరిరక్షణకు చర్యలు కోరుతూ విజ్ఞప్తి
- వేలాది కుటుంబాల జీవనోపాధికి భరోసా కల్పించాలని అభ్యర్థన
- చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించాలి

**హైదరాబాద్, జూన్ 18**

చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించి చేనేత కార్మి కుల ఉపాధిని పరిరక్షించాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. చేనేత కార్మికుల సమస్యలు, వారి జీవనోపాధి (మిగతా 2వ పేజీలో)



## మమతాకి హైకోర్టులో ఎదురుదెబ్బ

- ప్రతిపక్ష నేతగా రితబ్రతా బెనర్జీ కొనసాగింపు
- స్పీకర్ నిర్ణయాన్ని సమర్థించిన కోర్టు
- జూలై 28కి తదుపరి విచారణ వాయిదా

**కోల్‌కతా, జూన్ 18**

తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీలో రితబ్రతా బెనర్జీని ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈ వివాదం కోర్టు ముందుకు వచ్చింది. టీఎంసీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు పార్టీ నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో 90 మంది ఎమ్మెల్యేల్లో 64 మంది రితబ్రతా బెనర్జీకి మద్దతు (మిగతా 2వ పేజీలో)




## యుద్ధం ముగిసినా పెట్రోల్ ధరలు తగ్గవు

- వెంటనే ఇంధన ధరలను తగ్గించలేమన్న కేంద్ర మంత్రి సురేశ్ గోపీ
- హార్మూజ్‌లో నౌకల రద్దీ వల్లే ఆలస్యం.. కేంద్రానికి 12 వేల కోట్ల నష్టం

న్యూఢిల్లీ, జూన్ 18: అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన చారిత్రాత్మక శాంతి ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడి, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు దిగివస్తున్నప్పటికీ.. భారతీయ వినియోగదారులకు మాత్రం ఇప్పట్లో పెట్రోల్, డీజిల్ ధరల నుండి ఉపశమనం లభించేలా లేదు. గ్లోబల్ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ, దేశీయంగా ఇంధన ధరలను వెంటనే తగ్గించే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం గురువారం స్పష్టం చేసింది. ఇటీవల దేశంలో ఇంధన ధరల పెంపుదలపై పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ స్పందిస్తూ.. తరువాయి 2 వ పేజీలో...

# నేటి రాశి ఫలాలు

**మేషం :** పనుల్లో కొంత జాగ్రత్త అవసరం. నిర్ణయాల్లో ఆలోచన అవసరం. ఆర్థిక సంబంధ వ్యవహారాల్లో నియంత్రణ పాటించాలి. కుటుంబంలో చిన్నపాటి విభేదాలు రావచ్చు. నవగ్రహ శ్లోకాలు పఠించాలి.

**వృషభం :** వృత్తి, వ్యాపారాల్లో అనుకూల ఫలితాలు కనిపిస్తాయి. ఆర్థికంగా లాభాలు ఉన్నప్పటికీ ఖర్చులను నియంత్రించడం మంచిది. కుటుంబ సభ్యుల సహకారం పనులు పూర్తి చేయడంలో తోడ్పడుతుంది. శివారాధన చేయాలి.

**మిథునం :** ఉద్యోగంలో గుర్తింపు, పురోగతి కనిపిస్తుంది. ఆర్థిక పరంగా అభివృద్ధి, లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కుటుంబంలో ఆనందకర వాతావరణం ఉంటుంది. శ్రీమహాలక్ష్మీ ప్రార్థన శ్రేయస్కరం.

**కర్కాటకం :** ఉద్యోగంలో పురోగతి సాధ్యం అవుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆర్థికంగా స్థిరత్వం ఉంటుంది. కుటుంబ విషయాల్లో సహనం అవసరం. దుర్గా నామస్మరణ మేలు చేస్తుంది.

**సింహం :** వృత్తిలో కొత్త అవకాశాలు వస్తాయి. కొత్త ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థికంగా సాధారణ లాభాలు ఉంటాయి. ప్రయాణాలు అనుకూలంగా మారతాయి. సూర్యారాధన శుభప్రదం

**కన్య :** వ్యాపారంలో లాభాలు, పనుల్లో పురోగతి కనిపిస్తుంది. ఆర్థిక పరంగా మెరుగుదల ఉంటుంది. పెట్టుబడులు జాగ్రత్తగా చేయాలి. కుటుంబంలో శాంతి ఉంటుంది. శ్రీ మహాగణపతి ధ్యానం చేయాలి.

**తుల :** పనుల్లో జాగ్రత్తగా ముందుకు సాగాలి. ఆలస్యాన్ని తగ్గించాలి. ఆర్థికంగా సాధారణ పరిస్థితులు ఉంటాయి. కుటుంబంలో చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయి. శివనామస్మరణ శ్రేయస్కరం.

**వృశ్చికం :** వృత్తిలో లాభాలు, ఆదాయం పెరుగుతుంది. ఆర్థికంగా బలపడే సూచనలు ఉన్నాయి. కుటుంబంలో ఆనందకర పరిణామాలు ఉంటాయి. శ్రీసూర్య ధ్యానం శ్రేయస్కరం

**ధనుస్సు :** వృత్తిలో పురోగతి, గౌరవం లభిస్తుంది. ఆర్థికంగా లాభాలు ఉన్నప్పటికీ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. శ్రీవిష్ణు సహస్రనామం పఠించాలి.

**మకరం :** ఉద్యోగ, వ్యాపారాల్లో శుభఫలితాలు కనిపిస్తాయి. ఆర్థికంగా అభివృద్ధి, స్థిరత్వం ఉంటుంది. కుటుంబంలో శుభకార్యక్రమాల సూచనలు ఉంటాయి. శ్రీలక్ష్మీ అష్టోత్తరం పారాయణం చేయాలి.

**కుంభం :** పనుల్లో సహచరుల సహకారం లభిస్తుంది. ఆర్థికంగా లాభాలు ఉన్నప్పటికీ జాగ్రత్త అవసరం. కుటుంబంలో సమన్వయం మంచిది. నవగ్రహ శ్లోకాలు చదవాలి.

**మీనం :** ఉద్యోగంలో మంచి ఫలితాలు, గుర్తింపు లభిస్తుంది. ఆర్థికంగా శుభఫలితాలు ఉన్నాయి. ఖర్చుల విషయంలో నియంత్రణ అవసరం. కుటుంబ సభ్యుల సహకారం లభిస్తుంది. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ప్రార్థించాలి



## మమతాకి హైకోర్టులో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

తెలుపుతూ ఆయనను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని అసెంబ్లీ స్పీకర్‌ను కోరారు. ఎక్కువ మంది సభ్యుల మద్దతు ఉన్న నేపథ్యంలో స్పీకర్ రతింద్ర బోస్ రితబ్రతా బెనర్జీని ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ నిర్ణయం



తీసుకున్నారు. అయితే పార్టీ సూచించిన వ్యక్తిని కాకుండా తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేల మద్దతు ఉన్న నేతను ప్రతిపక్ష నేతగా గుర్తించడాన్ని మమతా బెనర్జీ సవాలు చేశారు. ఈ విషయమై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ క్రిష్ణా రావ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయంలో తక్షణం జోక్యం చేసుకునే పరిస్థితి లేదని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్న రితబ్రతా బెనర్జీని మార్చేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని స్పష్టం చేసింది. అలాగే ఈ వ్యవహారంపై స్పందించాలని స్పీకర్‌తో పాటు సంబంధిత ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తమ వాదనలు సమర్పించేందుకు ప్రతివాదులు మూడు వారాల గడువు కోరగా, కోర్టు రెండు వారాల సమయం మాత్రమే మంజూరు చేసింది. నిర్ణీత గడువులోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. కేసు తదుపరి విచారణను జూలై 28కి వాయిదా వేసిన కోర్టు, అప్పటి వరకు రితబ్రతా బెనర్జీనే పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా కొనసాగుతారని స్పష్టం చేసింది. ఈ తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



## హరిత తెలంగాణ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

స్థాయిలో విరుచుకుపడ్డారు. తాము అధికారంలోకి వస్తే భారత్ ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని పదేపదే చెబుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావుపై సీఎం రేవంత్ నిప్పులు చెరిగారు. ఫ్యూచర్ లేనివాళ్లే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాట్లాడుతున్నారు. ముందు నువ్వు సిద్దిపేటలో గెలిచి రా, ఆ తర్వాత రద్దు గురించి మాట్లాడు అని రేవంత్ సవాల్ విసిరారు. 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయిలో ఫ్యూచర్ సిటీ కడుతుంటే అందులో ఫార్మా, కెమికల్ ఫ్యాక్టరీలు కడతామని ఒక దిక్కుమాలినోడు దుష్ప్రచారం చేస్తున్నాడని ఆయన ఫైర్ అయ్యారు. పారిశ్రామికవేత్తలు సైతం చూసి నేర్చుకునేలా ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామన్నారు.

### సబర్మతీ కన్నా అద్భుతంగా మూసీ

దేశ రాజధాని ఢిల్లీ, ముంబై, బెంగళూరు లాంటి నగరాల్లో గాలి, నీరు విషంగా మారి పాఠశాలలు మూసేసే దుస్థితి నెలకొందని సీఎం గుర్తుచేశారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతోనే 30 వేల ఎకరాల ఫ్యూచర్ సిటీలో 15 వేల ఎకరాలను పార్కుల కింద అభివృద్ధి చేయబోతున్నామన్నారు. అమ్ముడుపోయిన వ్యక్తులు ఎన్ని ఆటంకాలు సృష్టించినా, ఎవరు ఏమనుకున్నా మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరుతామని స్పష్టం చేశారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర అంతర్జాతీయ స్థాయిలో రివర్‌ఫ్రంట్ పూర్తి చేసే బాధ్యత తనదేనన్నారు. సబర్మతీ, గంగా, యమునా నదుల రివర్‌ఫ్రంట్ల కన్నా అద్భుతంగా మూసీ రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు.

### కబ్జాదారుల కోరలు పీకేందుకే హైడ్రా

వర్షాలు వచ్చినప్పుడు బస్తీలు నీట మునిగి, వేలాది కుటుంబాలు రోడ్డున పడటానికి కబ్జారాయుళ్లే కారణమని సీఎం మండిపడ్డారు. చెరువులు, నాలాలు, పార్కులు కబ్జా చేసిన వారి కోరలు పీకేందుకే హైడ్రాను తీసుకువచ్చామన్నారు. అయితే కొందరు దీన్ని భూతంగా చూపిస్తున్నారని, పేదల జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశారు. గుర్రంగూడ స్థలాన్ని కబ్జా చేసి ప్రైవేట్ వ్యక్తులు లేఅవుట్ చేయాలని చూస్తే.. సుప్రీంకోర్టులో బలంగా వాదించి రక్షించుకున్నామని సీఎం వెల్లడించారు. ఆ స్థలంలో 100 ఎకరాలను నేషనల్ పార్క్ కోసం కేటాయించామన్నారు. ఎల్బీనగర్ ప్రాంతంలో 424 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పార్క్ నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించానని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏ పనులు చేయాలన్నా కేవలం ఒక ప్రాంతం వైపు మాత్రమే చేశారని, కూతవేటు దూరంలో ఉన్న ఎల్బీనగర్, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, హయత్ నగర్, గుర్రంగూడ, బైరామల్ గూడ, సాయబ్ నగర్ లాంటి ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని సీఎం విమర్శించారు. ఆ వివక్షను రూపుమాపి, ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే రూ. 2,400 కోట్లతో కోహెడ వద్ద అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నామని ప్రస్తావించారు.

### 11 జిల్లాల్లో వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు

అంతకుముందు గుర్రంగూడ ఎకో పార్క్‌లో సీఎం రేవంత్ మొక్కను నాటి వనమహోత్సవాన్ని ప్రారంభించారు. ఎకో పార్క్‌లో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఎకో పార్క్‌లో రూ. 35.50 కోట్లతో, గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ. 17.84 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వీటితో పాటు నిజామాబాద్, కొత్తగూడెం, హనుమకొండ, మెదక్, మహబూబ్‌నగర్, ములుగు, నారాయణపేట, భూపాలపల్లి, సంగారెడ్డి, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో రూ. 17.66 కోట్ల విలువైన అర్బన్ పార్కులు, వన్యప్రాణి సంరక్షణ తదితర పనులను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ముఖ్యమంత్రిని కలిసి.. నియోజకవర్గంలోని పలు రెవెన్యూ సమస్యలు, ఫ్లైఓవర్ల నిర్మాణానికి సంబంధించి వినతిపత్రం అందజేశారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. చిన్నారులతో మమేకమై వారి చదువులు, అభిరుచుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో గడిపిన సమయం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పీవీ నరసింహారావు బహుభాషా కోవిదుడిగా, దూరదృష్టి గల నాయకుడిగా దేశ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. 16 భాషల్లో ప్రావీణ్యం సాధించిన ఆయన జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యతో పాటు పోషకాహారం కూడా విద్యార్థుల అభివృద్ధికి ఎంతో అవసరమని కేటీఆర్ అన్నారు. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే చిన్నారులకు నాణ్యమైన విద్య, మెరుగైన సదుపాయాలు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలకు తమ మద్దతు కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణలో గతంలో విద్యారంగ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేసిన కేటీఆర్,



2023లో ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రస్తావించారు. విద్యార్థుల విద్యా, ఆరోగ్యాభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలు మరింత విస్తృతంగా అమలు కావాల్సిన అవసరం ఉందన్నారు. స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌కు అవసరమైన అదనపు తరగతి గదులు, ఆధునిక గ్రంథాలయ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సేవలను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత ..

(మొదటి పేజీ తరువాయి)

అంశాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. వరంగల్ జిల్లా చేనేత సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 50కు పైగా చేనేత సహకార సంఘాలకు చెందిన సుమారు 5 వేల మంది చేనేత కార్మికులు పనిచేస్తున్నారని ఆమె తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా రాష్ట్ర వస్త్రోత్పత్తి రంగానికి వారు వెన్నెముకగా నిలుస్తూ వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నారని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాసంస్థలు, ఇతర ప్రభుత్వ విద్యాసం స్థలకు అవసరమైన బెడ్‌షీట్లు, కార్పెట్లు, యూనిఫాంలు తదితర వస్త్ర ఉత్పత్తులను చేనేత సంఘాలు నిరంతరం సరఫరా చేస్తున్నాయని వివరించారు. ఈ రంగంపై ఆధార పడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. కేంద్రీకృత టెండర్ విధానం అమలుతో చేనేత సహకా ర సంఘాలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానం కారణంగా చిన్న స్థాయి చేనేత సంఘాలు పోటీలో నిలవలేక ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల చేనేత ఉత్పత్తులకు ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని కోరారు. చేనేత కార్మికుల సంక్షేమం, ఉపాధి భద్రత, సంప్రదాయ చేనేత రంగ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని వారి న్యాయ మైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించా లని విజ్ఞప్తి చేశారు. చేనేత రంగాన్ని బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుంద ని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించడం ద్వారా వేలాది మంది కార్మికుల జీవనోపాధిని కాపాడవచ్చని మంత్రి కొండా సురేఖ తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని, కార్మికుల సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

## యుద్ధం ముగిసినా పెట్రోల్ ధరలు తగ్గవు

మొదటి పేజీ తరువాయి

దేశవ్యాప్తంగా లీటరు ఇంధనంపై దాదాపు రూ. 3.94 మాత్రమే పెంచామని గుర్తుచేశారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన, ఆ పెంపును తక్షణమే ఉపసంహరించుకోవడం సాధ్యం కాదని ఆయన తేల్చిచెప్పారు. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచినప్పటికీ, ప్రస్తుతం అక్కడ అంతర్జాతీయ నౌకల రాకపోకల రద్దీ విపరీతంగా పెరిగిపోయిందని మంత్రి వివరించారు. దీనివల్ల తక్కువ ధరకు లభించే ముడి చమురు భారతదేశానికి చేరుకోవడానికి ఇంకా చాలా సమయం పడుతుందని, ఈ సాంకేతిక కారణాల వల్లే ధరలను వెంటనే తగ్గించలేకపోతున్నామని ఆయన స్పష్టంచేశారు.

సహకరించని రాష్ట్రాలు.. కేంద్రంపైనే రూ. 12వేల కోట్ల భారం

పశ్చిమాసియాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశీయ చమురు కంపెనీలు తీవ్రంగా నష్టపోయాయని, ఆ ఆర్థిక సంక్షోభ ప్రభావం ఇంకా కొనసాగుతోందని మంత్రి సురేశ్ గోపీ పేర్కొన్నారు. "యుద్ధ సమయంలో ప్రజలపై భారం పడకుండా ఇంధన ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించేందుకు ఏ ఒక్క రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు రాలేదు. దీంతో ఆ భారాన్ని అంతా కేంద్ర ప్రభుత్వమే భరించాల్సి వచ్చింది. ఫలితంగా కేంద్రం ఏకంగా రూ. 12వేల కోట్ల మేర భారీ ఆదాయాన్ని కోల్పోయింది." ఈ నేపథ్యంలో, అటు చమురు కంపెనీల ఆర్థిక నష్టాల రికవరీని, ఇటు అంతర్జాతీయ చమురు సరఫరా లైన్లను సమన్వయం చేసుకుంటూ భవిష్యత్తులో నిర్ణయాలు ఉంటాయే తప్ప, తక్షణమే ధరల తగ్గింపు ఉండదని కేంద్రం తేల్చిచెప్పింది.

# శ్వేత సంపాదకీయం

**శుక్రవారం 19-6-2026**

# విద్యారంగంలో మార్పులు కావాలి!

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు, స్కూళ్ల వల్ల సమాజంలో అసమనాతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ధి చేయడం వల్ల సమాజాంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడీని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి. విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు.

ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది. గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి.

ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది. ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి. మీడియం తెలుగు అయినా స్పోకెన్ ఇంగ్లీష్ ఉంటే పిల్లలు కూడా పెద్దయ్యాక బెరకు లేకుండా దూసుకు పోగలరు. ఇవన్నీ గమనించి విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యలకు అడుగులు వేస్తే విద్యారంగంలో విప్లవం సాధించగలం.



# జగన్ 2.0లో కార్యకర్తలకే పెద్దపీట

మొదటి పేజీ తరువాయి

అమలు చేస్తామని ప్రకటించారు. వచ్చే రెండేళ్లు పార్టీకి అత్యంత కీలకమని పేర్కొంటూ, కార్యకర్తలు ప్రజల మధ్య ఉంటూ పేదల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలందరి బాధ్యత తనదేనని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి ఇంట్లో తమ ఐదేళ్ల పాలన, ప్రస్తుత కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన మధ్య పోలిక జరుగుతోందని జగన్ వ్యాఖ్యానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిందని, సచివాలయ వ్యవస్థ, ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్, ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. దిశ యాప్ ద్వారా మహిళలకు భద్రత కల్పించామని, గ్రామ సచివాలయాల్లో మహిళా కానిస్టేబుళ్లను నియమించామని గుర్తు చేశారు. తమ పాలనలో పేదల సంక్షేమం, పారదర్శక పరిపాలనకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేకంగా మాట్లాడిన జగన్, తమ ప్రభుత్వ హయాంలో 3,22,528 ఎకరాల ఆర్ఓఎఫ్ఆర్ (=ాఖీ=) డీకేటీ భూములకు హక్కు పత్రాలు పంపిణీ చేశామని వెల్లడించారు. ఒక్క రంపచోడవరం ప్రాంతంలోనే 20 వేల మంది గిరిజనులకు 80 వేల ఎకరాల భూములకు పట్టాలు అందించామని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 17 కొత్త మెడికల్ కాలేజీలలో పాడేరు, పార్వతీపురం, నర్సీపట్నంలో మూడు కాలేజీలు గిరిజన ప్రాంతాలకే కేటాయించామని తెలిపారు. అదేవిధంగా కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ, సాలూరులో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, బుట్టాయగూడెం, దోర్నాలలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు.

ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆరోపించిన జగన్, 18 ఏళ్లు నిండిన మహిళలకు ఏడాదికి రూ.18 వేల చొప్పున రెండేళ్లకు రూ.36 వేల బకాయి, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున రెండేళ్లకు రూ.72 వేల బకాయి, 50 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.4 వేల చొప్పున రెండేళ్లకు రూ.96 వేల బకాయి ఉన్నాయని పేర్కొన్నారు. రైతు భరోసా కింద రెండేళ్లలో ఇవ్వాల్సిన రూ.40 వేలలో కేవలం రూ.14 వేలు మాత్రమే అందించారని, రూ.26 వేల బకాయి ఉందని విమర్శించారు. అమ్మ ఒడి అమలులో కోతలు పెట్టారని, ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. పోలవరం ముంపు బాధితులకు పరిహారం చెల్లింపుల్లో వివక్ష కొనసాగుతోందని, దీనిపై వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటం కొనసాగిస్తామని, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేస్తామని జగన్ స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేసిన జగన్, ఎన్నికలకు ముందు ఉన్న ఈ రెండేళ్ల కాలాన్ని పూర్తిగా ప్రజా సమస్యలపై పోరాటాలకు వినియోగించాలని సూచించారు. అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, సంక్షేమ పథకాల అమలులో జరిగిన లోపాలను ఎప్పటికప్పుడు ఎత్తిచూపాలని కోరారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం అసంతృప్తి వాతావరణం నెలకొందని, ప్రజల మద్దతుతో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేసిన ఆయన, "జగన్ 2.0"లో కార్యకర్తలకే నిర్ణయాత్మక పాత్ర ఉంటుందని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, ప్రాధాన్యం కల్పిస్తామని స్పష్టం చేశారు.



# 30న రైతు భరోసా!

మొదటి పేజీ తరువాయి

ఈ సీజన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా దేశంలోనే రికార్డు స్థాయిలో ఇప్పటికే దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందని మంత్రులు తెలిపారు.

### కేంద్రంపై ఆందోళన.. బీజేపీ ఎంపీలకు పిలుపు

తెలంగాణ నుంచి కేంద్ర ప్రభుత్వం తక్కువ ధాన్యాన్ని సేకరించడంపై కేబినెట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో పండిన మొత్తం ధాన్యాన్ని కేంద్రమే సేకరించాలని డిమాండ్ చేసింది. కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర మరియు విధివిధానాల ప్రకారమే రాష్ట్రంలో పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర వృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి మన రాష్ట్రం నుండి గెలిచిన బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు కలిసి రావాలని మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు.

### ఎరువుల కోటా కోసం మంత్రులు ఢిల్లీకి

వానాకాలం సీజన్‌కు రావాల్సిన ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేబినెట్ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఈ విషయమై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే పలుమార్లు కేంద్రానికి లేఖలు రాశారని, అయినా స్పందన లేనందున త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యక్షంగా విజ్ఞప్తి చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే, రామగుండం ఫర్టిలైజర్స్ లో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని స్పష్టం చేశారు. ఇక్కడి యూరియాను మధ్యప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలకు పంపకుండా స్థానికంగా ఇస్తే రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయని అభిప్రాయపడ్డారు.

### మెట్రో రెండో దశ, ఐఆర్ఎఫ్‌సీ రుణాలపై డిమాండ్

హైదరాబాద్ ట్రాఫిక్ మరియు ప్రయాణికుల అవసరాల దృష్ట్యా అత్యంత కీలకమైన హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 విస్తరణకు కేంద్రం వెంటనే అనుమతులు ఇవ్వాలని కేబినెట్ కోరింది. ఐఆర్ఎఫ్‌సీ ఒప్పందం ప్రకారం రాష్ట్రానికి రావలసిన రుణాన్ని కూడా వెంటనే విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి కేంద్రం కొత్తగా తీసుకువచ్చిన వీబీ-జీ ఆర్ఏఎం జీ పథకం కాకుండా, పాత ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని మంత్రివర్గం తీర్మానించింది. కొత్త చట్టం వల్ల కూలీలపై, రాష్ట్ర ఖజానాపై పడే ఆర్థిక ప్రభావాన్ని సమగ్రంగా అధ్యయనం చేయడానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, వివేక్ వెంకటస్వామిల ఆధ్వర్యంలో ఒక కేబినెట్ సబ్-కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, జూన్ 25వ తేదీ లోపు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుందని మంత్రులు స్పష్టం చేశారు.

### డిజిటల్ కేబినెట్ అమల్లోకి

ఈ నెల 21న జాతీయ స్థాయిలో జరిగే నీట్ పరీక్షకు రాష్ట్రంలోని 208 కేంద్రాల్లో హాజరవుతున్న దాదాపు 2 లక్షల 95 వేల మంది విద్యార్థులకు కేబినెట్ పెద్ద ఉపశమనం కల్పించింది. పరీక్ష రోజున విద్యార్థులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించబోతున్నట్లు ప్రకటించింది. పరిపాలనలో ఆధునికతను జోడిస్తూ ఇకపై రాష్ట్రంలో డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

# గ్రీనింగ్ సొసైటీ ఏర్పాటు

అమరావతి, జూన్ 18: వెలగపూడి సచివాల యంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రీనింగ్ సొసైటీకి సంబంధించిన నిబంధనలు, నియామకాలు, విధివిధానాలన్నీ ప్రెసిడెన్షియల్ ఆర్డర్-2025కు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు.



ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్య మైనదని పేర్కొంటూ ఎలాంటి జాప్యం లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించా రు. రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఒక నర్సరీ ఏర్పాటు చేయాలని, అది సాధ్యం కాని ప్రాంతాల్లో మూడు లేదా నాలుగు పంచాయతీలను క్లస్టర్‌గా తీసుకుని ఉమ్మడి నర్సరీలను ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ వీబీ-జీ రామ్ జీ పథకంతో నర్సరీల అభివృద్ధిని అనుసంధానించినట్లు పేర్కొంటూ, ఆ పథకం ద్వారా లభించే నిధులు, ఉపాధి దినాలను సమర్థంగా వినియోగించి గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీల విస్తరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చల్లేందుకు 2.6 కోట్ల సీడ్ బాల్స్ సిద్ధం చేసినట్లు అటవీశాఖ అధికారులు సమావేశంలో వివరించారు. ఈ వర్షాకాలంలో వాటిని అటవీ ప్రాంతాలు, ఖాళీ భూముల్లో వెదజల్లేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కొండ ప్రాంతాల్లో విత్తనాల పంపిణీ కోసం 40 నుంచి 50 అత్యాధునిక డ్రోన్లను వినియోగించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ యంత్రాంగానికే పరిమితం చేయకుండా విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. అంతరించిపోతున్న అరుదైన వృక్ష జాతుల సంరక్షణలో అటవీశాఖ చేస్తున్న కృషిని పవన్ కళ్యాణ్ అభినందించారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలోని పాములేరు వాగు పరిసరాల్లో కేవలం 10 మాత్రమే మిగిలి ఉన్న అరుదైన వెదురు జాతిని గుర్తించి దానికి 'బాంబూసా ఆంధ్రీకమ్'గా నామకరణం చేయడం విశేషమన్నారు. అలాగే శేషాచలం అడవి ప్రాంతానికే పరిమితమైన, అంతరించిపోతున్న 'సైకాస్ శేషాచలన్సిస్' మొక్కల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలను కూడా ప్రశంసించారు. సమావేశంలో అటవీ, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.సమావేశంలో గ్రీనింగ్ సొసైటీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో మొక్కల పెంపకం, అటవీ విస్తరణ, జీవ వైవిధ్య పరిరక్షణ కార్యక్రమాలను అమలు చేసే కార్యాచరణపై కూడా చర్చించారు.




## ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 18 :-

సంగారెడ్డిలోని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమంపై బీజేపీ శ్రేణులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సీ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, మాజీ ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, గత పదేళ్లుగా అధికారంలో ఉన్న వారు ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియపై ప్రజలకు సరైన అవగాహన కల్పించలేదని విమర్శించారు. తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపడితే అక్రమ ఓట్లు వెలుగులోకి వస్తాయనే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శలు చేస్తోందని ఆయన ఆరోపించారు. దేశంలో ప్రతి వ్యక్తికి ఒకే ఒక్క ఓటు ఉండే విధంగా ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. 2002 నుంచి ఉన్న ఓటరు నమోదులను ప్రామాణికంగా తీసుకుని, వాటి ఆధారంగా మిగిలిన నమోదులను పరిశీలించి అక్రమ లేదా నకిలీ ఓట్లను గుర్తించి తొలగించడమే ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఓటు చోరీ జరిగిందంటూ వస్తున్న విమర్శలను ఆయన ఖండిస్తూ, అక్కడ ఎలాంటి ఓట్ల దొంగతనం జరగలేదని అన్నారు. దేశంలో జన్మించిన ప్రతి అర్హ పౌరుడికి కుల, మత భేదాలు లేకుండా ఓటు హక్కు కల్పించే విధానానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.




## తొలగించిన బిస్లరీ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 18 :-

పాశమైలారం పారిశ్రామిక ప్రాంతంలోని బిస్లరీ ఇంటర్నేషనల్ సంస్థలో చట్టవిరుద్ధంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ కన్వీనర్, సీఐటీ యూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. బిస్లరీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతుగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గత వారం రోజులుగా కార్మికులు శాంతియుతంగా సమ్మె చేస్తున్నప్పటికీ యాజమాన్యం సమస్యను పరిష్కరించకుండా బెది రింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్మికులను చట్టవిరు ద్ధంగా తొలగించడమే సమ్మెకు కారణమని పేర్కొన్నారు. కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాలని, తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బిస్లరీ కార్మికుల సమ్మెకు వివిధ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నుంచి రోజురోజుకు సంఘీభావం పెరుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు, పార్లే యూనియన్ నాయకులు, బిస్లరీ యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

## ఈ నెల 24న జిల్లా స్థాయి అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిట సమావేశం

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 18

జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్ లో ఈ నెల 24న ఉదయం 10.00 గంటలకు జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ శెట్కార్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ (దిశ) సమావేశం జరగనుందని డీఆర్డీఓ జ్యోతి ఒక ప్రకటన లో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిధులచే వివిధ శాఖల ద్వారా అమలవుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై దిశ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆమె ఒక ప్రకటనలో తెలియజేశారు.

# ఎకో పార్కును వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి

### పచ్చదనం, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది



సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 18 :-

జహీరాబాద్ పట్టణ శివారులో జాతీయ రహదారి పక్కన అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న త్రివేణివనం-ఫారెస్ట్ ఎకో పార్కును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం హైద్రాబాద్ నుండి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పచ్చని వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో వనమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన 11 ఎకో పార్కులను ముఖ్యమంత్రి వర్చువల్‌గా ప్రారంభించడం సంతోష కరమన్నారు. జహీరాబాద్ ప్రాంతం నిమ్జ్ ద్వారా పారిశ్రామిక స్మార్ట్ సిటీగా రూపుదిద్దు కుంటోందని, భారీ పరిశ్రమలు రావడంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. జాతీయ రహదారి పక్కనే 208 ఎకరాల విస్తీర్ణంలో పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబా టులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో ఉన్న అన్ని సౌకర్యాలు త్రివేణి జీఐబీసీ చైర్‌పర్సన్ నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించ వచ్చన్నారు. మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్లు, అడవులను సంర క్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను నాటి వాటిని సంరక్షించే అలవాటు చేసుకో వాలని కోరారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కనే ఉన్న త్రివేణివనం- ఫారెస్ట్ ఎకో పార్కు ఎంతో ఆకర్ష ణీయంగా అభివృద్ధి చేయబడిం దన్నారు. పార్కులో సైక్లింగ్ వంటి ప్రత్యేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించి పార్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదే స్ఫూర్తితో వనమ హోత్సవంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చ దనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. జహీరా బాద్ శాసన సభ్యులు మాణిక్ రావు మాట్లాడుతూ త్రివేణివనం జహీరాబాద్ ప్రజలకు గొప్ప వరమని అన్నారు. మనిషి జీవితంలో చెట్లతో విడదీయరాని అనుబంధం ఉందని, చెట్లు ఉంటేనే మానవ మనుగడ సుసంపన్నంగా ఉంటుందని పేర్కొ న్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని కోరారు. అనంతరం అతిథులు అటవీ శాఖ రూపొందిం చిన వనమహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. పిమ్మట సఫారీ వాహనంలో ఎకో పార్కును సం దర్శించి వివిధ సౌకర్యాలను పరిశీలించడంతో పాటు మొక్కలు నాటారు. అనంతరం జెండా ఊపి సైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మున్సిపల్ చైర్మన్ యూనిస్, ఉజ్వల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లా అటవీ అధికారి ప్రసాద్ రెడ్డి, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, అటవీ శాఖ అధికారులు, పోలీసు అధికారులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సంస్థల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### ఆకస్మిక తనిఖీల్లో డీఎంహెచ్‌వో డా. కె. లలితాదేవి సూచనలు



సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 18 :-

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డా. కె. లలితాదేవి గురువారం కొండాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), సదాశివపేట అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ (యూఎఫ్‌డబ్ల్యూసీ), బస్తీ దవాఖాన, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)తో పాటు జిల్లా ఆసుపత్రిలోని టీ-హబ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా వైద్య సంస్థల్లో అందుతున్న వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఔషధాల లభ్యత, ప్రయోగశాల సేవలు, రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. అనంతరం సదాశివపేటలోని వైద్యాధికారులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీలు), సూపర్వైజర్లు, ఇతర సిబ్బందితో సమావేశమై ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు వంటి అసంక్రమణ వ్యాధుల (ఎన్‌సీడీ) గుర్తింపు, స్క్రీనింగ్, చికిత్స, ఫాలోఅప్ సేవలను మరింత విస్తరించాలని ఆదేశించారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమం పురోగతిని సమీక్షించిన డీఎంహెచ్‌వో, అర్హులైన బాలికలకు వందశాతం టీకాలు అందేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. జిల్లా ఆసుపత్రిలోని టీ-హబ్ కేంద్రాన్ని సందర్శించిన ఆమె, అక్కడి వివిధ విభాగాల్లో రోగులకు అందుతున్న సేవలు, వైద్య సదుపాయాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించి, సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

### ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి: ఏబీవీపీ

### డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన విద్యార్థి సంఘం నాయకులు



సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 18 :-

ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజులను నియంత్రించడంతో పాటు విద్యార్థుల హక్కులను పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మెదక్ విభాగ్ కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తాగునీటి సమస్యలు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ మరియు ఇతర విద్యా సదుపాయాల లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, ఇతర విద్యా సామగ్రిని సకాలంలో అందజేసేలా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదం డ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని పేర్కొంటూ, ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా హక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపును తప్పనిసరిగా అమలు చేసి, పేద మరియు బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యలపై జిల్లా విద్యాశాఖ వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ రాజు, నగర కార్యదర్శి ధనరాజ్, ప్రమోద్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్--యూజీ పరీక్షను ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించాలి





సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 18 :-

జూన్ 21న జిల్లాలో నిర్వహించనున్న నీట్ (యూజీ)--2026 ప్రవేశ పరీక్షను ఎలాంటి లోపాలకు తావులేకుండా ప్రశాంత, పారదర్శక వాతావరణంలో కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం జూమ్ సమావేశం ద్వారా సంబంధిత శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 9 పరీక్షా కేంద్రాల్లో 2,924 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయ స్థాయి పరీక్ష కావడంతో ప్రతి అధికారి అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, ఫర్నిచర్, లైటింగ్, సీసీ కెమెరాల పనితీరు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అన్ని మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని చీఫ్ సూపరింటెండెంట్లకు సూచించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్--144 అమలు చేయడంతో పాటు జిరాక్స్ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. ప్రతి పరీక్ష గదిలో వాల్ క్లాక్ ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైన మేరకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద ప్రాథమిక వైద్య సదుపాయాలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యంత్రాంగం నీట్ పరీక్షను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించి సమగ్ర భద్రతా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్ష సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అభ్యర్థులు పరీక్షకు సంబంధించిన మార్గదర్శకాలను పూర్తిగా చదివి, హాల్ టికెట్‌లో పేర్కొన్న సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

# క్యూఎస్--2027 ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఐఐటీ హైదరాబాద్ ఘన విజయం

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 18 :-

భారతీయ సాంకేతిక విద్యా సంస్థ (ఐఐటీ) హైదరాబాద్ అంతర్జాతీయ ఉన్నత విద్యా రంగంలో మరో ప్రతిష్ఠాత్మక విజయాన్ని నమోదు చేసింది. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్--2027లో ప్రపంచవ్యాప్తంగా 588వ స్థానాన్ని దక్కించుకుని గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 76 స్థానాలు మెరుగుపరుచుకుంది. పరిశోధన నాణ్యత, అంతర్జాతీయ ప్రభావాన్ని ప్రతిబింబించే సైటేషన్స్ పర్ ఫ్యాకల్టీ విభాగంలో ప్రపంచ స్థాయిలో 123వ ర్యాంక్ సాధించడం సంస్థకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. ఈ విభాగంలో ఐఐటీ హైదరాబాద్ 86.8 స్కోరు నమోదు చేసి, అధ్యాపకులు, పరిశోధకుల శాస్త్రీయ కృషి ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతోందని నిరూపించింది. అకడమిక్ ప్రతిష్ఠ, ఉద్యోగ అవకాశాలు, ఎంప్లాయర్ రెప్యుటేషన్, సస్టైనబిలిటీ వంటి కీలక ప్రమాణాల్లో కూడా సంస్థ గణనీయమైన పురో గతి కనబరిచింది. మొత్తం స్కోరు 28.7కు చేరుకోవ డంతో ప్రపంచ వ్యాప్తంగా ర్యాంక్ పొందిన విశ్వవిద్యా లయా ల్లో 61 శాతం కంటే మెరుగైనపనితీరును ప్రదర్శించింది.



# బాధిత బాలికకు శస్త్రచికిత్స.. రూ.5 లక్షల ఆర్థిక సాయం

**హైదరాబాద్, జూన్ 18 :**

ఖమ్మం జిల్లాలో లైంగిక దాడికి గురై ప్రస్తుతం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి జస్టిస్ పంచాక్షరి నిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా బాలికకు అందుతున్న వైద్య చికిత్స, శస్త్రచికిత్స అనంతర ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం మంత్రికి వివరాలు అందించింది. బాలిక ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఆమె కోలుకునేందుకు ప్రత్యేక వైద్య బృందం సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి సీతక్క, జస్టిస్ పంచాక్షరి బాలిక తల్లిదండ్రులను కలిసి పరామర్శించారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ కుటుంబ



సభ్యులకు మానసిక బలాన్ని అందించారు. రాష్ట్ర ప్రభుత్వం మీకు అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. బాలిక పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్యం, సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క తెలిపారు. బాధిత కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారిం చాలని అధికారులకు సూచించినట్లు తెలిపా రు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న బాధిత బాలిక కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయ చెక్కును మంత్రి సీతక్క, జస్టిస్ పంచాక్షరి కలిసి అందజేశారు. చికిత్స, పునరావాసం, కుటుంబ అవసరాల కోసం ఈ సాయం ఉపయోగప డుతుందని పేర్కొన్నా రు. అవస రమైతే మరింత సహాయం అందిం చేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. బాలిక ఆరోగ్యం మెరుగు పడి సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క పునరుద్ఘాటించారు. కుటుంబానికి అవసరమైన న్యాయప రమైన, ఆర్థికపరమైన సహాయాన్ని అందించ డంతో పాటు బాధితురాలికి న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసు కుంటామని స్పష్టం చేశారు.

# యూరియా యాప్ రద్దు చేయాలని బీఆర్ఎస్ మహాధర్నా

**నిజామాబాద్, జూన్ 18 :**

రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తూ యూరియా పంపిణీలో అమలు చేస్తున్న యాప్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిం చారు. వేల్పూర్ క్రాస్ రోడ్ వద్ద జాతీయ రహదారి-63పై రైతులతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అమలు చేస్తున్న యూరియా యాప్ కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా



రని ఆరోపించారు. ఎరువుల కోసం రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వ్యవసాయ పనులు సకాలంలో జరగకుండా ఇబ్బందులు ఎదురవుతున్నా యని పేర్కొన్నారు. రైతు అవసరాలను దృష్టిలో ఉంచుకుని యాప్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎకరానికి నాలుగు సంచుల యూరియాను ఎలాంటి పరిమితులు లేకుండా ఒకేసారి అందించాలని ఆయన కోరారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల కారణంగా రైతులు పలుమార్లు ఎరువుల కోసం తిరగాల్సి వస్తోందని విమర్శించారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు సకా లంలో అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సహకార సంఘా లు, ఎరువుల దుకాణాల్లో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వ లు ఉంచాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరత కారణంగా రైతులు ప్రైవేట్ మార్కెట్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయాలంటే రైతులకు అవసరమైన ఇన్‌పుట్లు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మహాధర్నాలో పాల్గొన్న రైతులు కూడా తమ సమస్యలను ప్రస్తావించారు. యూరియా కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, సమయానికి ఎరువులు అందక పంటలపై ప్రభావం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. రైతు ప్రయోజనాలకు భంగం కలిగించే విధానాలను ప్రభుత్వం పునఃసమీక్షించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఖరీఫ్ సన్నద్ధతపై సమీక్ష నిర్వహించిన మంత్రి

**హైదరాబాద్, జూన్ 18 :**

రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాల లభ్యత, ఎరువుల సరఫరా, సాంకేతిక సేవల వినియోగంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో విత్తన కంపెనీల ప్రతినిధు లు, ఎరువుల డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక భాగస్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తనాలు రైతులకు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా



చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్‌తో పాటు ఎగుమతి అవకాశాలు ఉన్న ఈ రకాల విత్తనాల ఉత్పత్తి, పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైతులకు ఎరువుల సరఫరాలో పారదర్శకత తీసుకురావడానికి అమలు చేస్తున్న యూరియా యాప్‌పై కూడా సమావేశంలో చర్చ జరిగింది. భూమి వివరాలు, పంట అవసరాలను ఆధారంగా చేసుకుని ఎరువుల పంపిణీ జరుగుతున్న తీరుపై ఎరువుల డీలర్ల అభిప్రాయాలను మంత్రి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఉపగ్రహ సాంకేతికత ఆధారంగా పంటల్లో వచ్చే చీడపీడలు, వ్యాధులను ముందుగానే గుర్తించే వ్యవస్థను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో రైతులకు సకాలంలో సూచనలు అందించి పంట నష్టాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. పంటల ప్రణాళిక, నాణ్యమైన విత్తనాల సరఫరా, ఎరువుల సమర్థ పంపిణీ, సాంకేతిక సేవల విస్తరణ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు డిజిటల్ సాంకేతికత, శాస్త్రీయ విధానాలను విస్తృతంగా వినియోగించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల సంక్షేమం, పంటల ఉత్పాదకత పెంపు, మార్కెట్ అవకాశాల విస్తరణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# మెట్ టెండర్లలో అవకతవకలు లేవు హైడ్రా

**హైదరాబాద్, జూన్ 18 :**

వర్షాకాలంలో నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర సేవలు అందించేందుకు చేపట్టిన మెట్ (మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్) టెండర్ల ఎంపికలో ఎలాంటి అవకతవకలు జరగలేదని హైడ్రా స్పష్టం చేసింది. మెట్ టెండర్లలో గోల్‌మాల్ జరిగిందంటూ ప్రచారం జరుగుతున్న వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలకు చెందిన తొమ్మిది మంది ఇంజినీర్లతో కూడిన కమిటీ టెండర్లను పరిశీలించి ఎంపిక చేసినట్లు హైడ్రా వెల్లడించింది. అనంతరం హైడ్రా అధికారులు అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే టెండర్లను ఖరారు చేసినట్లు తెలిపింది. ఎంపిక ప్రక్రియలో నిబంధనలను పూర్తిగా పాటించామని పేర్కొంది. మెట్ వాహనాలను క్షేత్రస్థాయిలో వినియోగించే ముందు కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం, ఫిట్‌నెస్, బీమా పత్రాలను సమర్పించాల్సిన నిబంధనలో మాత్రమే కొంత సడలింపు ఇచ్చామని హైడ్రా తెలిపింది. అయితే గత అనుభవం, ఆర్థిక సామర్థ్యం, సొంతం లేదా లీజు వాహనాల అంశాల్లో ఎలాంటి సడలింపులు ఇవ్వలేదని స్పష్టం చేసింది. చిన్న సాంకేతిక అంశాలను పెద్దవిగా చూపిస్తూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. గతేడాది కూడా మెట్ టెండర్ల విషయంలో ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పటికీ సమర్థులైన కాంట్రాక్టర్లకే పనులు అప్పగించామని హైడ్రా గుర్తు చేసింది. గత వర్షాకాలంలో మెట్ బృందాలు సమర్థవంతంగా పనిచేసి నగర ప్రజలకు సేవలు అందించా యని తెలిపింది. నగరంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంలో ఈ బృందాల పాత్ర కీలకమైందని పేర్కొంది. పట్నం శ్రీశైలం అనే కాంట్రాక్టర్‌పై హైడ్రా ప్రత్యేకంగా స్పందించింది. గత ఏడాది సొంత వాహనాలు సమకూరు స్తామని హామీ ఇచ్చినా అద్దె వాహనాలతోనే పనులు నిర్వహించారని తెలిపింది. ఈ ఏడాది కూడా 30 టెండర్లకు దరఖాస్తు చేసినప్పటికీ సొంత లేదా లీజు వాహనాలకు సంబంధించిన పత్రాలు సమర్పించకపోవడంతో ఎంపిక కమిటీ ఆయనను అనర్హుడిగా ప్రకటించిందని వివరించింది. టెండర్లు దక్కకపోవడంతో కొందరు అసత్య ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై, హైడ్రాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని హైడ్రా ఆరోపించింది.

# అటవీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ వన సంరక్షణ పురస్కారాలు

**హైదరాబాద్, జూన్ 18 :**

అటవీ సంపద పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. వన మహోత్సవం--2026 ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని "తెలంగాణ రాష్ట్ర వన సంరక్షణ ప్రతిభా పురస్కార పతక నియమావళి--2026"ను ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ నిర్ణయం వెనుక అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన కృషి కీలకంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు. అటవీ సంపద సంరక్షణ, అటవీ భూముల రక్షణ, వన్యప్రాణుల పరిరక్షణ, అక్రమ కలప రవాణా నియంత్రణ



వంటి రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న అటవీ సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కల్పించాలని మంత్రి కొండా సురేఖ గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం కొత్త పురస్కారాల విధానానికి ఆమోదం తెలిపింది. ఈ కొత్త విధానంలో భాగంగా నాలుగు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రవేశపెట్టారు. తెలంగాణ వన సంరక్ష పతకం (రజత పతకం), తెలంగాణ ఉత్తమ వన సంరక్ష పతకం (వెండి పతకం), తెలంగాణ విశిష్ట వన సంరక్ష పతకం (బంగారు పతకం), తెలంగాణ ముఖ్యమంత్రి వన శౌర్య పతకం (ప్రత్యేక బంగారు పతకం) పేర్లతో అవార్డులను ప్రదానం చేయనున్నారు. అటవీ సంరక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎంపిక చేసి ఈ పురస్కారాలు అందజేయనున్నారు. పురస్కారాలతో పాటు నగదు బహుమతులు, నెలవారీ ప్రోత్సాహకాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణ వన సంరక్ష పతకానికి రూ.10 వేల నగదు, ఉత్తమ వన సంరక్ష పతకానికి రూ.15 వేల నగదు, విశిష్ట వన సంరక్ష పతకానికి రూ.20 వేల నగదు, ముఖ్యమంత్రి వన శౌర్య పతకానికి రూ.25 వేల నగదు బహుమతిని అందజేయనున్నారు. అదనంగా నెలవారీ ప్రోత్సాహక నగదు కూడా ఇవ్వనున్నారు. అటవీ భూముల పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ నేరాల నియంత్రణ, అగ్నిప్రమాదాల నివారణ, నర్సరీల నిర్వహణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, జీఐఎస్, ఎంఐఎస్ వ్యవస్థల వినియోగం, పరిశోధన వంటి రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఈ అవార్డులకు ఎంపిక చేయనున్నారు.



## మణుగూరులో 80 కిలోల గంజాయి స్వాధీనం

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 18 :**

మణుగూరు మండలంలోని తోగ్గుడెం ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. పోలీసులకు అందిన సమాచారంతో తోగ్గుడెం వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక కారును ఆపి తనిఖీ చేయగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని అందులో ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో మొత్తం 80 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. నిందితుల నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.



## నీట్ విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

**హైదరాబాద్, జూన్ 18 :**

జూన్ 21న నిర్వహించనున్న నీట్ (రీ-నీట్) పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయం తీసుకుంది. పరీక్ష రాసే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, సమయానికి చేరుకునేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. విద్యార్థులపై ప్రయాణ భారం తగ్గించి వారికి సహకారం అందించడమే లక్ష్యమని పేర్కొంది. నీట్ పరీక్ష రాసే విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను ఆర్టీసీ సిబ్బందికి చూపిస్తే ఉచితంగా ప్రయాణించవచ్చని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష రోజున విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది.



## బీజేపీ జాతీయ అధ్యక్షుడిని కలిసిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు

**న్యూఢిల్లీ, జూన్ 18 :**

తెలంగాణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఈ నెలాఖరులో జరగనున్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి సంబంధిం చిన ఏర్పాట్లు, పార్టీ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. తెలంగాణలో పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తల పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, వివిధ పార్టీల రాజకీయ వ్యూహాలు, ప్రజా సమస్యలపై కూడా ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



## సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

**ఖమ్మం, జూన్ 18 :**

జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, పరిహారం చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్అండ్ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, మున్నేరు--పాలేరు లింక్ కాలువతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొనసాగుతున్న ఇతర సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, పరిహారం చెల్లింపులు, సర్వే పనులు, పెండింగ్ కోర్టు కేసుల స్థితిగతులను కలెక్టర్ కమిషనర్‌కు వివరించారు. ప్రాజెక్టుల అమలులో పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కమిషనర్ సూచించారు. భూసేకరణ ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవార్డుల జారీ, పరిహారం చెల్లింపుల ప్రక్రియ పారదర్శకంగా, వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## ఏజెన్సీ గ్రామంలో సేవా కార్యక్రమం

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 18 :**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సూచనల మేరకు దుమ్ముగూడెం పోలీసులు కొత్తపల్లి ఏజెన్సీ గ్రామంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రజల అవసరాలను గుర్తించి వారికి సహాయం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ అరుణ్ కుమార్ హాజరై గ్రామ ప్రజలను కలిశారు. గ్రామంలో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితులను తెలుసుకుని వారి అవసరాలపై ఆరా తీశారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను వినిపించుకున్నారు. సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలు కుటుంబాలకు గృహావసర వస్తువులను పంపిణీ చేశారు. నిత్యజీవితంలో ఉపయోగపడే వస్తువులను అందజేసి వారికి అండగా నిలిచారు. పోలీసు శాఖ సామాజిక బాధ్యతలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



## గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**గద్వాల, జూన్ 18 :**

జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ఐపీఎస్ గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు, ప్రజలకు అందుతున్న సేవలపై క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ పరిశుభ్రత, నిర్వహణపై ఆరా తీశారు. స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, భద్రతా ప్రమాణాలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ విభాగాన్ని తనిఖీ చేసిన ఎస్పీ, ఫిర్యాదుదారులకు అందుతున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు సత్వర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల స్వీకరణలో పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. స్టేషన్ రైటర్ విభాగం నిర్వహణ, కేసు రికార్డులు, పత్రాల భద్రత తదితర అంశాలను కూడా ఎస్పీ పరిశీలించారు.

## కొండాపూర్‌లో హెచ్-సిటీ ప్రాజెక్టు పనుల పరిశీలన

**హైదరాబాద్, జూన్ 18 :**



కొండాపూర్‌లో చేపట్టనున్న హెచ్-సిటీ ప్రాజెక్టు పనుల పురోగతిని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి అంజయ్యనగర్ ప్రాంతంలో పర్యటించిన ఆయన, ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ పురోగతిని కమిషనర్ పరిశీలించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పూర్తి చేసి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు అమలులో జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొండాపూర్ ప్రధాన రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ రహదారి విస్తరణ పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. రోడ్డు విస్తరణ పూర్తయితే వాహనాల రాకపోకలు సులభతరం కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. హెచ్-సిటీ ప్రాజెక్టు అమలుతో వేలాది మంది ప్రయాణికులకు ప్రయోజనం చేకూరనుందని అధికారులు వివరించారు. రహదారి సామర్థ్యం పెరగడం వల్ల ప్రయాణ సమయం తగ్గి నగర రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని తెలిపారు. స్థానిక ప్రజలకు కూడా మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రాజెక్టు అమలులో భాగంగా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైన అనుమతులు, సాంకేతిక ప్రక్రియలను వేగవంతం చేసి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## కేబీఆర్ పార్కులో పెట్ గ్రూమింగ్ కేంద్రం ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 18 :**

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ గేట్ నంబర్-5 వద్ద ఏర్పాటు చేసిన పెట్ గ్రూమింగ్ కేంద్రాన్ని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రారంభించారు. పెంపుడు జంతువుల సంరక్షణకు అవసరమైన ఆధునిక సేవలను అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి. సంతోష్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. కేంద్ర నిర్వహణ ప్రతినిధులు, పెంపుడు జంతువుల యజమానులు, ప్రజలు కూడా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కేంద్రంలో పెంపుడు జంతువులకు అవసరమైన గ్రూమింగ్ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. జంతువుల పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు సేవలను ఒకేచోట అందించే విధంగా సౌకర్యాలను అభివృద్ధి చేసినట్లు



అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం అధికారులు కేంద్రంలోని సదుపాయాలను పరిశీలించారు. నిర్వహణ విధానం, అందుబాటులో ఉన్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. పెంపుడు జంతువుల యజమానులతో మాట్లాడి వారి అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. నగరంలో పెంపుడు జంతువుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటి సంరక్షణకు మెరుగైన సేవలు అందించడం అవసరమని అధికారులు అభిప్రాయపడ్డారు.



## రామంతాపూర్ చెరువు పునరుద్ధరణ పనులకు శ్రీకారం

**హైదరాబాద్, జూన్ 18 :**

నగరంలోని చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తున్న హైడ్రా మరో కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతాపూర్ పెద్ద చెరువు పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం భూమిపూజ చేసి ప్రారంభించారు. నగరంలో వరద ముప్పును తగ్గించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడే లక్ష్యంతో ఈ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రామంతాపూర్ చెరువు ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం సుమారు 30 ఎకరాలు కాగా, అందులో దాదాపు 16 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. వీటిలో 12 ఎకరాల మేర శాశ్వత నిర్మాణాలు ఉండటంతో వాటిని ప్రస్తుతానికి యథాతథంగా ఉంచారు. మరో నాలుగు ఎకరాల్లో ఉన్న తాత్కాలిక గుడిసెలు, షెడ్లను తొలగించి చెరువు పునరుద్ధరణకు అవసరమైన భూమిని అందుబాటులోకి తీసుకువచ్చారు. హైడ్రా రెండో విడత చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఈ పనులు చేపడుతోంది. ఇప్పటికే తొలి విడతలో ఆరు చెరువుల పునరుద్ధరణ పూర్తిచేయగా, ప్రస్తుతం మరో 14 చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రామంతాపూర్ చెరువు అభివృద్ధికి సుమారు రూ.19 కోట్ల వ్యయం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ చెరువు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే పరిసర ప్రాంతాల్లో వరదల ముప్పు గణనీయంగా తగ్గుతుందని అంచనా వేస్తున్నారు.

## నక్ష సర్వే పనులను వేగవంతం చేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 18 :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నక్ష కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న భూ రికార్డుల నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఆర్.ఓ.ఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) నమోదు పనుల పురోగతిని సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. మణుగూరు మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో మున్సిపల్ సిబ్బంది నిర్వహిస్తున్న నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి ఎంట్రీ నమోదు విధానం, వివరాల సేకరణ ప్రక్రియ, నమోదు వేగం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ వివరాల నమోదు సమయంలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూములకు సంబంధించిన సమాచారం అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయడం చాలా ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భవిష్యత్ అవసరాలకు ఈ రికార్డులు ఆధారంగా ఉండనున్నందున ప్రతి వివరాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పారదర్శకంగా ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. నక్ష పైలట్ ప్రాజెక్టు ద్వారా భూ రికార్డుల వ్యవస్థ మరింత సమగ్రంగా మారుతుందని కలెక్టర్ తెలిపారు. భూముల యాజమాన్యానికి సంబంధించిన వివరాలు స్పష్టంగా నమోదవడంతో భూ వివాదాలు తగ్గడంతో పాటు ప్రజలకు సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.



## హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

**, జూన్ 18 :**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని హెచ్ఎంటీ నగర్ పెద్ద చెరువు వద్ద కొనసాగుతున్న సుందరీకరణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. రూ.37.50 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెరువు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న



సుందరీకరణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన, నిర్మాణ కార్యకలాపాలను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇప్పటివరకు హెచ్ఎంటీ నగర్ నుంచి ఇందిరానగర్ వైపు వెళ్లేందుకు ప్రత్యక్ష మార్గం లేకపోవడంతో అభివృద్ధి పనులకు అవసరమైన యంత్రాలు, సామగ్రి రవాణాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో పనుల పురోగతిపై ప్రభావం పడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి ఎస్‌టీపీ సమీపం నుంచి హెచ్ఎంటీ నగర్, ఇందిరానగర్ ప్రాంతాలను అనుసంధానించే మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే యంత్రాల రాకపోకలు సులభతరం కావడంతో పనులు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చెరువు సుందరీకరణ పూర్తయిన తర్వాత స్థానిక ప్రజలకు మెరుగైన వాతావరణం, వినోద సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ం



## విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చు కలెక్టర్

**జనగామ, జూన్ 18 :**

విద్యే పేదరికాన్ని జయించే అత్యంత శక్తివంతమైన ఆయుధమని, విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. జనగామ మండలం చౌడారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రత్యేక తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్ వారి అభ్యాసన స్థాయిని పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు స్వయంగా గణితం బోధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. గణితాన్ని కష్టమైన సబ్జెక్టుగా కాకుండా ఆసక్తికరమైన అంశంగా భావించాలని, దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తే ఉన్నత విద్యా అవకాశాలు సులభంగా లభిస్తాయని సూచించారు. అన్ అకాడమీ తరగతులను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. 8వ, 9వ, 10వ తరగతి విద్యార్థులకు మూడు సంవత్సరాల ప్రణాళికతో అందుబాటులోకి వచ్చిన ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు పోటీ ప్రపంచంలో రాణించేందుకు దోహదపడతాయని తెలిపారు. గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రాలపై అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చదువుతో పాటు ఆరోగ్యంపైనా శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. పోషకాహారం తీసుకోవడం, సమయానికి నిద్రపోవడం, క్రమశిక్షణతో జీవించడం ద్వారా ఏకాగ్రత పెరిగి మెరుగైన ఫలితాలు సాధించవచ్చున్నారు. విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉపాధ్యాయులు లేదా అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.



## అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలికలెక్టర్

**జనగామ, జూన్ 18 :**

చిన్నారుల ఆరోగ్యాభివృద్ధి, పోషకాహార స్థితిగతులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం జనగామ మండలంలోని మరిగడి గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఆయన కేంద్ర నిర్వహణ, పిల్లలకు అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశీలన సందర్భంగా కేంద్రంలో నమోదైన చిన్నారుల ఎత్తు, బరువు వివరాలను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. పిల్లల ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితులు, పోషకాహార స్థాయికి సంబంధించిన వివరాలను అంగన్వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి చిన్నారి ఆరోగ్య సమాచారాన్ని క్రమం తప్పకుండా నమోదు చేస్తూ పర్యవేక్షించాలని సూచించారు. తక్కువ బరువు ఉన్న చిన్నారులు, ఎదుగుదలలో వెనుకబడిన పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి వారికి అవసరమైన పోషకాహారం, వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్య స్థితిపై నిరంతర నిఘా ఉంచి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రంలో అందిస్తున్న పోషకాహార సేవలు, హాజరు నమోదు, పరిశుభ్రత, నిర్వహణ అంశాలను కూడా కలెక్టర్ సమీక్షించారు. కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు.

# కాంగో షాక్.. పోర్చుగల్‌కు డ్రా

**హియూస్టన్, జూన్ 18 :**
ఫిఫా ప్రపంచకప్-2026 గ్రూప్ 'కె' తొలి మ్యాచ్‌లో బలమైన పోర్చుగల్‌కు డీఆర్ కాంగో గట్టి షాక్ ఇచ్చింది. హియూస్టన్‌లో జరిగిన ఈ మ్యాచ్ 1-1తో డ్రాగా ముగియడంతో కాంగో ప్రపంచకప్ చరిత్రలో తొలి పాయింట్‌ను ఖాతాలో వేసుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన పోర్చుగల్ ఆరో నిమిషంలోనే ఆధిక్యం సాధించింది. పెడ్రో నెటో అందించిన అద్భుతమైన క్రాస్‌ను జోవావ్ నెవెస్ హెడర్ ద్వారా గోల్‌గా మలచడంతో పోర్చుగల్ 1-0తో ముందంజ వేసింది. అయితే తొలి అర్ధభాగం ముగిసే సమయానికి కాంగో సమాధానం ఇచ్చింది. యోవాన్ విస్సా లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ హెడర్‌తో గోల్ నమోదు చేశాడు. దీంతో స్కోరు 1-1తో సమమైంది. ఇదే ప్రపంచకప్ చరిత్రలో కాంగో జట్టు సాధించిన తొలి గోల్‌గా నమోదైంది. రెండో అర్ధభాగంలో ఇరు జట్లు గెలుపు కోసం ప్రయత్నించినప్పటికీ మరో గోల్ నమోదు కాలేదు. కాంగో రక్షణ శ్రేణి పోర్చుగల్ దాడులను సమర్థంగా అడ్డుకోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇక తన కెరీర్‌లో ఆరో ప్రపంచకప్ ఆడుతున్న పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రోనాల్డో తీవ్రంగా నిరాశపరిచాడు. మొత్తం మ్యాచ్‌లో అతడు కేవలం 29 సార్లు మాత్రమే బంతిని తాకాడు. ప్రపంచకప్ కెరీర్‌లో అతని అత్యల్ప భాగస్వా మ్య ప్రదర్శనల్లో ఇది ఒకటిగా నిలిచింది. రెండో అర్ధభాగంలో రోనాల్డోకు రెండు స్పష్టమైన గోల్ అవకాశాలు వచ్చినప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. కాంగో రక్షణ ఆటగాళ్లు అతడిని సమర్థంగా కట్టడి చేయడంతో పోర్చుగల్ పూర్తి పాయింట్లు సాధించే అవకాశాన్ని కోల్పోయింది.ం




# ఇషాన్ విధ్వంసం.. స్వాన్ ప్రశంసల జల్లు

**లక్నో, జూన్ 18 :**



ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన రెండో వన్డేలో శతకంతో చెలరేగిన భారత యువ బ్యాటర్ ఇషాన్ కిషన్‌పై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ ప్రశంసల వర్షం కురిపించాడు. జట్టులోకి తిరిగి వచ్చిన తర్వాత ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నాడు. లక్నో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ కేవలం 79 బంతుల్లోనే 125 పరుగులు చేసి భారత జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, 7 భారీ సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి మూడో వికెట్‌కు 224 పరుగుల అద్భుత భాగస్వామ్యం నెలకొల్పి ఆఫ్ఘన్ బౌలర్లపై పూర్తిస్థాయి ఆధిపత్యం చెలాయించాడు. మ్యాచ్ అనంతరం మాట్లాడిన గ్రేమ్ స్వాన్.. జట్టులో ఏ పాత్ర ఇచ్చినా ఇషాన్ సమర్థంగా నిర్వర్తిస్తాడని కొనియాడాడు. "ఇషాన్‌కు ఎలాంటి బాధ్యత అప్పగించినా వెనుకాడడు. జట్టులోకి తిరిగి వచ్చి ఇంత ప్రభావవంతమైన ఇన్నింగ్స్ ఆడటం గొప్ప విషయం. అతడు పరిస్థితులకు తగ్గట్టుగా తన ఆటను మార్చుకోగలడు" అని ప్రశంసించాడు. ఇషాన్ సెంచరీ సాధించిన విధానం తనను మరింత ఆకట్టుకుందని స్వాన్ వెల్లడించాడు. తొలి అర్ధశతకాన్ని ఓపికగా నిర్మించిన ఇషాన్, ఆ తర్వాత దూకుడు పెంచి కేవలం 19 బంతుల్లోనే మరో 50 పరుగులు సాధించడం ప్రత్యేకమని పేర్కొన్నాడు. అయితే అవి అజాగ్రత్తగా ఆడిన షాట్లు కాదని, సరైన బంతులను మాత్రమే ఎంచుకుని బౌండరీలకు తరలించాడని వివరించాడు. ఇషాన్ తన ఆటలో ఉన్న లోపాలను సరిదిద్దుకునేందుకు తీవ్రంగా శ్రమించాడని, గతంలో బలహీనతగా భావించిన అంశాలనే ఇప్పుడు తన బలంగా మార్చుకున్నాడని స్వాన్ అభిప్రాయపడ్డాడు. అదే అతడిని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతోందని వ్యాఖ్యానించాడు. ఇషాన్, గిల్ జోడీ చెలరేగడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఆఫ్ఘనిస్థాన్‌ను 232 పరుగులకే పరిమితం చేశారు. ఫలితంగా భారత్ 170 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకుని ఆధిపత్యాన్ని చాటుకుంది. ఇషాన్ కిషన్ అద్భుత ఫామ్, శుభ్‌మన్ గిల్ నిలకడైన ఆటతీరు జట్టుకు మరింత బలాన్నిస్తున్నాయని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మన్‌ప్రీత్ సింగ్‌కు అరుదైన ఘనత

**రోటర్‌డామ్, జూన్ 18 :**


భారత హాకీ జట్టు స్టార్ ఆటగాడు మన్‌ప్రీత్ సింగ్ దేశ హాకీ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించాడు. భారత జట్టు తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా సరికొత్త రికార్డు సృష్టించాడు. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్ వేదికగా జర్మనీతో జరిగిన ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్ మ్యాచ్‌లో బరిలోకి దిగిన మన్‌ప్రీత్ తన 413వ అంతర్జాతీయ మ్యాచ్‌ను పూర్తి చేశాడు. దీంతో హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ పేరిట ఉన్న 412 మ్యాచ్‌ల రికార్డును అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ చారిత్రక విజయాన్ని గుర్తిస్తూ హాకీ ఇండియా మన్‌ప్రీత్ సింగ్‌కు రూ.10 లక్షల నగదు బహుమతిని ప్రకటించింది. గత పదిహేనేళ్లుగా భారత హాకీ జట్టుకు అతడు కీలక ఆటగాడిగా సేవలందిస్తున్నాడని, అతని అంకితభావం, నిలకడ అసాధారణమని ప్రశంసించింది. 2011లో కేవలం 19 ఏళ్ల వయసులో భారత జట్టులోకి ప్రవేశించిన మన్‌ప్రీత్, తన ప్రతిభతో జట్టులో కీలక స్థానాన్ని సంపాదించుకున్నాడు. టోక్యో ఒలింపిక్స్, పారిస్ ఒలింపిక్స్‌లలో కాంస్య పతకాలు గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా నిలిచి దేశానికి గౌరవం తీసుకొచ్చాడు. అంతర్జాతీయ హాకీలో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మన్‌ప్రీత్ ప్రస్తుతం ఐదో స్థానంలో ఉండటం మరో విశేషం. భారత హాకీకి ఆయన అందించిన సేవలు విశేషమైనవిగా క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ సందర్భంగా మన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, భారత్ తరఫున ఇన్ని మ్యాచ్‌లు ఆడటం తనకు గర్వకారణమని పేర్కొన్నాడు. ఈ ఘనతను తన సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులకు అంకితం చేస్తున్నానని తెలిపాడు. భవిష్యత్తులో భారత జట్టుకు ఒలింపిక్ స్వర్ణ పతకం, ప్రపంచకప్ టైటిల్ అందించడమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశాడు. హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ టిర్కీ మాట్లాడుతూ, మన్‌ప్రీత్ సాధించిన ఈ ఘనత అతని కృషి, క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనమని అన్నారు. రాబోయే తరాలకు అతడు ఆదర్శంగా నిలుస్తాడని కొనియాడారు. హాకీ ఇండియా ప్రధాన కార్యదర్శి భోలా నాథ్ సింగ్ కూడా మన్‌ప్రీత్‌ను అభినందిస్తూ భారత హాకీకి ఆయన చేసిన సేవలను ప్రశంసించారు.

# రొనాల్డోపై విమర్శలు.. కోహ్లీ పాత వ్యాఖ్యలు మళ్లీ వైరల్

**లిస్బన్, జూన్ 18 :**



ఫిఫా ప్రపంచకప్--2026లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన పోర్చుగల్ జట్టు తొలి మ్యాచ్‌లోనే నిరాశపరిచింది. డీఆర్ కాంగోతో జరిగిన పోరులో డ్రాతో సరిపెట్టుకోవడంతో జట్టుతో పాటు స్టార్ ఫుట్‌బాలర్ క్రిస్టియానో రొనాల్డోపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తన కెరీర్‌లో చివరి ప్రపంచకప్ ఆడుతున్న రొనాల్డో నుంచి అభిమానులు భారీ ప్రదర్శన ఆశించినప్పటికీ, అతడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో 143 గోల్స్ సాధించి చరిత్ర సృష్టించిన 41 ఏళ్ల రొనాల్డో ప్రస్తుత టోర్నీలో తన అనుభవాన్ని చూపించలేకపోయాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగోతో జరిగిన మ్యాచ్ లో అతడికి వచ్చిన అవకాశాలను సద్వినియో గం చేసుకోలేకపోవడంతో విమర్శక^ులు మరిం తగా విరుచుకుపడుతు న్నారు. కొందరు అతడిని జట్టులోకి ఎంపిక చేయడంపైనా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ దిగ్గజం విరాట్ కోహ్లీ గతంలో రొనాల్డోకు మద్దతుగా చేసిన వ్యాఖ్యలు మళ్లీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. 2022 ఖతార్ ప్రపంచకప్‌లో పోర్చుగల్ నిష్క్రమించిన తర్వాత తీవ్ర నిరాశకు గురైన రొనాల్డోకు అండ^గా నిలిచిన కోహ్లీ, అతడిని ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ క్రీడాకారుల్లో ఒకడిగా అభివర్ణించాడు. "ఏ ట్రోఫీ అయినా, ఏ టైటిల్ అయినా మీరు ఈ క్రీడకు చేసిన సేవను తగ్గించలేవు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిపై మీరు చూపిన ప్రభావాన్ని ఎలాంటి రికార్డులు కొలవలేవు. మీ ఆటపట్ల ఉన్న అంకితభావం, మైదానంలో చూపించే తపన ప్రతి క్రీడాకారుడికి స్ఫూర్తి. నా దృష్టిలో మీరే అత్యుత్తమ ఆటగాడు" అంటూ కోహ్లీ అప్పట్లో పేర్కొన్నాడు. రొనాల్డో ప్రస్తుత ప్రదర్శనపై స్పందిస్తున్న పలువురు క్రీడా విశ్లేషకులు కూడా అతడి సామర్థ్యం తగ్గలేదని అభిప్రాయపడుతున్నారు. వేగవం తమైన ఆధునిక ఫుట్‌బాల్‌కు అనుగుణంగా జట్టులో సమన్వయం కుదరకపోవడం, సహచ^ర ఆటగాళ్లతో అనుసంధానం ఆశించిన స్థాయిలో లేకపోవడమే ప్రధాన కారణమ ని చెబుతున్నారు. తమ తమ క్రీడల్లో ఎన్నో శిఖరాలు అధిరోహించిన రొనాల్డో, కోహ్లీ ఇద్దరూ కెరీర్‌లో ఇలాంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నవారే. విమర్శలకు ఆటతోనే సమాధానం చెప్పిన చరిత్ర వారిద్దరికీ ఉంది. ఇదే నేపథ్యంలో రొనాల్డో కూడా మిగిలిన మ్యాచ్‌ల్లో తన పాత మాంత్రికతను చూపించి పోర్చుగల్ జట్టును విజయపథంలో నడిపించాలని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# క్రొయేషియాపై ఇంగ్లాండ్ ఘన విజయం

**డల్లాస్, జూన్ 18 :**
ఫిఫా ప్రపంచకప్--2026 గ్రూప్ ఎల్‌లో ఇంగ్లాండ్ జట్టు విజయంతో శుభారంభం చేసింది. టెక్సాస్‌లోని డల్లాస్ స్టేడియంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో క్రొయేషియాను 4-2 తేడాతో ఓడించి పూర్తి పాయింట్లు సాధిం చింది. కొత్త ప్రధాన శిక్షకుడు థామస్ తుచెల్ ఆధ్వర్యంలో ఇంగ్లాండ్‌కు ఇది తొలి ప్రధాన టోర్నమెంట్ విజయం కావడం విశేషం. మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన ఇంగ్లాం డ్‌కు కెప్టెన్ హ్యారీ కేన్ నాయకత్వం వహించాడు. 12వ నిమిషంలో లభించిన పెనాల్టీని గోల్‌గా మలిచి జట్టుకు తొలి ఆధిక్యం అందించాడు. అనంతరం 42వ నిమిషంలో హెడర్ ద్వారా మరో గోల్ నమోదు చేశాడు. దీంతో ప్రపంచకప్‌లలో ఇంగ్లాండ్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన గ్యారీ లినెకర్ 10 గోల్స్ రికార్డును కేన్ సమం చేశాడు. అయితే క్రొయేషియా కూడా గట్టి పోరాటం చేసింది. ఇంగ్లాండ్ రక్షణ విభాగంలోని లోపాలను సద్వినియోగం చేసుకుంటూ 36వ నిమిషంలో మార్టిన్ బాతురినా గోల్ సాధించాడు. తొలి అర్ధభాగం ముగిసే వేళ పెటార్ ముసా మరో గోల్ నమోదు చేయడంతో విరామ సమయానికి స్కోరు 2-2తో సమమైంది. రెండో అర్ధభాగంలో ఇంగ్లాండ్ పూర్తిగా ఆధిపత్యం చెలాయించింది. విరామ సమయంలో శిక్షకుడు తుచెల్ ఇచ్చిన సూచనలు జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. రెండో భాగం ప్రారంభమైన రెండు నిమిషాలకే జూడ్ బెల్లింగ్‌హామ్ అద్భుతమైన గోల్ చేసి ఇంగ్లాండ్‌ను మళ్లీ ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. మ్యాచ్ ముగింపుకు ఐదు నిమిషాలు మిగిలి ఉండగా ప్రత్యామ్నాయ ఆటగాడిగా బరిలోకి దిగిన మార్కస్ రాష్‌ఫోర్డ్ మరో గోల్ నమోదు చేశాడు. బుకాయో సాకా అందించిన చక్కటి పాస్‌ను గోల్‌గా మలిచిన రాష్‌ఫోర్డ్ ఇంగ్లాండ్ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో గ్రూప్ ఎల్‌లో ఇంగ్లాండ్ బలమైన సందేశం పంపింది.







# వైభవ్‌పై చర్యల ప్రచారం బీసీసీఐ ఖండన

**ముంబయి, జూన్ 18 :**
శ్రీలంక-ఏ, భారత్-ఏ జట్ల మధ్య జరిగిన ముక్కోణపు వన్డే టోర్నీలో యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ప్రవర్తనపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి ఖండించింది. మైదానంలో జరిగే ఘటనల విషయంలో బీసీసీఐ నేరుగా జోక్యం చేసుకోదని సంస్థ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. ఈ నెల 9న దంబుల్లా వేదికగా జరిగిన భారత్-ఏ, శ్రీలంక-ఏ మ్యాచ్ అనంతరం ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీలంక ఆటగాడు విషేన్ హలంబగే భారత యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో హలంబగే దగ్గరకు రావడంతో వైభవ్ అతడిని తోసిన ఘటన చర్చనీయాంశమైంది.

ఈ ఘటన నేపథ్యంలో వైభవ్‌పై బీసీసీఐ కఠిన చర్యలు తీసుకోనుందనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. దీనిపై స్పందించిన దేవజిత్ సైకియా, మైదానంలో జరిగే సంఘటనలపై నిర్ణయం తీసుకునే అధికారం మ్యాచ్ రిఫరీలు, అంపైర్లకే ఉంటుందని తెలిపారు. "మ్యాచ్ సందర్భంగా చోటుచేసుకునే ఘటనలు పూర్తిగా మ్యాచ్ రిఫరీ, అంపైర్ల పరిధిలోకి వస్తాయి. అలాంటి అంశాల్లో బీసీసీఐ జోక్యం చేసుకోదు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన వ్యవస్థ అమల్లో ఉంది. తుది నిర్ణయం వారి చేతుల్లోనే ఉంటుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, మ్యాచ్ అనంతరం జరిగిన వేర్వేరు ఘటనలకు సంబంధించి శ్రీలంక ఆటగాళ్లు విషేన్ హలంబగే, నీరోషన్ డిక్వెల్లాపై మ్యాచ్ రిఫరీ ప్రదీప్ జయప్రకాశ్ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. సూపర్ ఓవర్ విజయం తర్వాత భారత ఆటగాళ్లను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించినందుకు హలంబగేపై, అతిగా అప్పీల్ చేసినందుకు డిక్వెల్లాపై ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది.



# వెంకీ-త్రివిక్రమ్ సినిమాపై క్రేజీ బజ్

**హైదరాబాద్, జూన్ 18 :**
విక్టరీ వెంకటేష్ అభిమానులకు వరుసగా శుభవార్తలు అందుతున్నాయి. ఇటీవల అనిల్ రావిపూడి దర్శకత్వంలో కొత్త సినిమా ఘనంగా ప్రారంభమైన నేపథ్యంలో, ఇప్పుడు దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వెంకటేష్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47' చిత్రంపై సినీ వర్గాల్లో భారీ చర్చ సాగుతోంది. చాలా ఏళ్ల విరామం తర్వాత వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో సినిమా రూపొందుతుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన చిత్రాలు మంచి విజయాలు సాధించడంతో ఈసారి కూడా మరో విజయాన్ని అందుకుంటారనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను 2026 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని నిర్మాతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే విడుదల తేదీపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్, పూజిత పొన్నాడ కీలక పాత్రల్లో నటించనున్నారు. అలాగే రావు రమేష్, బ్రహ్మాజీ, నరేష్ తదితర ప్రముఖ నటులు కూడా ముఖ్య పాత్రలు పోషించనున్నారు. ఈ చిత్రానికి ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నాడు. త్రివిక్రమ్ ప్రత్యేక శైలిలో ఉండే కుటుంబ భావోద్వేగాలు, వినోదభరిత సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. విడుదల తేదీపై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఉదయపు అలవాట్లే నా బలం: సమంత



సినీ నటి సమంత తన జీవితంలో ఎదురైన మానసిక ఒత్తిడులు, ఆత్మన్యూనత భావాలను అధిగమించడంలో క్రమబద్ధమైన ఉదయపు దినచర్య కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు. ఇటీవల అభిమానులతో ముచ్చటించిన ఆమె, తన రోజువారీ అలవాట్ల గురించి వివరించారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు నిద్రలేస్తానని సమంత తెలిపారు. నిద్రలేచిన వెంటనే కృతజ్ఞతా డైరీ రాయడం తన మొదటి పని అని చెప్పారు. జీవితంలో లభించిన మంచి విషయాలను గుర్తు చేసుకుంటూ వాటిని డైరీలో నమోదు చేయడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుందని వివరించారు. అనంతరం కొద్దిసేపు ఎండలో గడుపుతానని, తర్వాత శ్వాస వ్యాయామాలు చేసి దాదాపు అరగంట పాటు ధ్యానం చేస్తానని పేర్కొన్నారు. ఈ అలవాట్లు తనలోని ప్రతికూల ఆలోచనలను తగ్గించి, మానసిక స్థైర్యాన్ని పెంచాయని చెప్పారు. ప్రతి వ్యక్తిలోనూ భయాలు, సందేహాలు, ఆత్మన్యూనత భావాలు సహజమేనని సమంత అభిప్రాయపడ్డారు. అయితే క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవాటు చేసుకుంటే వాటిని అధిగమించడం సులభమవుతుందని సూచించారు. తన అనుభవం ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్నానని తెలిపారు. ఇటీవల 'ట్యాపింగ్' అనే విధానాన్ని కూడా అనుసరిస్తున్నట్లు సమంత వెల్లడించారు. ఇది శరీరంలోని శక్తి సమతుల్యతను కాపాడటంతో పాటు మానసిక ఒత్తిడి, శారీరక నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు.



## వెంకీ-కళ్యాణ్‌రామ్ మల్టీస్టారర్‌కు శ్రీకారం

టాలీవుడ్‌లో మరో భారీ మల్టీస్టారర్ చిత్రానికి అధికారికంగా శ్రీకారం చుట్టారు. విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ హీరోలుగా తెరకెక్కనున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్ర పూజా కార్యక్రమాలు గురువారం హైదరాబాద్‌లో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు ప్రముఖ దర్శకుడు కె. రాఘ వేంద్రరావు, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌తో పాటు సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. చిత్రానికి సంబంధించిన కథానాయికల వివరాలను కూడా ఈ సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. ఈ వినోదాత్మక కుటుంబ కథా చిత్రంలో వెంకటేష్ సరసన జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేష్ నటించనుండగా, కళ్యాణ్‌రామ్‌కు జోడీగా యువ కథానాయిక కృతి శెట్టి కనిపించనుంది. ఇద్దరు హీరోలు, ఇద్దరు కథానాయికల కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారింది. చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించనున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సురేష్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్ సంస్థలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. అనిల్ రావిపూడికి బాగా కలిసొచ్చిన సంక్రాంతి సీజన్‌ను ఈ సినిమాకూ ఎంపిక చేశారు. 2027 సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. దగ్గుబాటి, నందమూరి కుటుంబాల హీరోలు తొలిసారిగా కలిసి నటిస్తుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ రావిపూడి ప్రత్యేక శైలిలో హాస్యం, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



## దివి ఫొటోలు వైరల్ అభిమానుల ప్రశంసల వెల్లువ

బుల్లితెర రియాలిటీ షో 'బిగ్‌బాస్' ద్వారా తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి దివి వాద్య మరోసారి సోషల్ మీడియాలో చర్చనీయాం శంగా మారింది. తాజాగా ఆమె పంచుకున్న ఫొటోలు నెటిజన్లను ఆకట్టుకుంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. స్టైలిష్ దుస్తులు, ఆత్మవిశ్వాసంతో కూడిన హావభావా లు, ఆకర్షణీయమైన ఫోజులతో కనిపించిన దివి చిత్రాలు అభిమానుల నుంచి విశేష స్పందనను అందుకుంటున్నాయి. 'బిగ్‌బాస్' కార్యక్రమం అనంతరం దివి కెరీర్‌లో గణనీయ మైన మార్పులు చోటుచేసుకున్నాయి. చిన్నచిన్న అవకాశాలతో ప్రారంభమైన ఆమె సినీ ప్రయా ణం ప్రస్తుతం వేగంగా ముందుకు సాగుతోంది. ముఖ్యంగా చిత్రంలో కనిపించి ప్రేక్షకుల దృష్టి ని ఆకర్షించిన దివి, ఆ తర్వాత వరుస అవకా శాలను అందిపుచ్చుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకుంది. సినిమా లతో పాటు వెబ్ సిరీస్‌లు, బ్రాండ్ ప్రచార కార్యక్రమాలు, డిజిటల్ కంటెంట్ ద్వారా కూడా ఆమె తన ఉనికిని చాటుకుంటోంది. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉంటూ అభిమానులతో నిరంతరం మమేకమవుతోంది. తరచూ ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత అప్‌డేట్లను పంచుకుంటూ అనుచరుల సంఖ్య ను పెంచుకుంటోంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటిగా తన ప్రతిభను నిరూపించుకోవాలనే లక్ష్యంతో దివి విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటోంది.


## 'ది ఇండియా స్టోరీ' ఫస్ట్ లుక్ విడుదల

పముఖ నటి కాజల్ అగర్వాల్, నటుడు శ్రేయాస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా సామాజిక జాతీయతా నేపథ్య చిత్రం లిలి'ది ఇండియా స్టోరీ'లిలి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. పోస్టర్ విడుదలైన వెంటనే సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.

జీ స్టూడియోస్ సమర్పణలో ఎంఐజీ ప్రొడక్షన్స్ అండ్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. చెత్తన్ డీకే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు సాగర్ బి. షిండే కథ, కథనం అందించడంతో పాటు నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. సుమిత్ బగడే, అనితా జాదవ్, వినాయక్ సైదానీ, కల్పేష్ షా, దేవయాని ఖోరటే, ప్రేమ్ జోషి సహ నిర్మాతలుగా ఉన్నారు.




దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న ఆహార కల్తీ, వ్యవసాయ రంగంలో రసాయనాలు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, వాటి వెనుక ఉన్న అక్రమాల నేపథ్యంలో ఈ చిత్ర కథ రూపొందుతోంది. ప్రజారోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న అంశాలను ప్రధాన కథాంశంగా తీసుకుని దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బాంబే హైకోర్టు నేపథ్యంగా సాగే కోర్టు రూమ్ డ్రామాగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇందులో కాజల్ అగర్వాల్ శక్తివంతమైన న్యాయవాది పాత్రలో కనిపించ నుండగా, శ్రేయాస్ తల్పడే తన కుటుంబం కోసం పోరాడే ఆందోళ నలో ఉన్న తండ్రి పాత్రలో నటిస్తున్నారు.



## రాయ్ లక్ష్మీ వ్యాఖ్యలు మళ్లీ...

దక్షిణాది సినీ పరిశ్రమలో గ్లామర్ పాత్రలు, ప్రత్యేక గీతాలతో గుర్తింపు పొందిన ప్రముఖ నటి రాయ్ లక్ష్మీ మరోసారి వార్తల్లో నిలిచారు. గతంలో ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో మళ్లీ వైరల్ అవుతూ చర్చనీయాంశంగా మారాయి. సినీ రంగంలోకి అడుగుపెట్టిన తొలినా ళ్లలోనే తన అందం, నటనతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన రాయ్ లక్ష్మీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. కథానాయికగా నటించడమే కాకుండా పలు స్టార్ హీరోల చిత్రాల్లో ప్రత్యేక గీతాలతో కూడా విశేష ఆదరణ పొందారు. 2005లో విడుదలైన తమిళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన రాయ్ లక్ష్మీ, అనంతరం కన్నడ చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుని తనకం టూ ప్రత్యేక స్థానం ఏర్పరుచు కున్నారు. తెలుగులో కూడా పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. అనంతరం అగ్ర హీరోల సినిమాల్లో ప్రత్యేక గీతాలతో మరింత ప్రజాదరణ పొందారు. సినీ జీవి తంతో పాటు ఆమె వ్యక్తిగత జీవితం కూడా గతంలో తరచూ వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా భారత మాజీ క్రికెట్ జట్టు కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తో తన పేరు ముడిపెట్టిన ప్రచారాలపై గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద చర్చకు దారితీశాయి.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467